సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



నత్తనడకన ఆలయ నిర్మాణాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా దేవాలయాల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆలయాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 10లో ▸



దొంగల ముఠా అరెస్టు

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. 10లో ▸



లిక్విడ్ గంజాయితో అరెస్టు

లిక్విడ్ గంజాయి కలిగి ఉన్న 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లిలో దాడి చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 10లో ▸

ప్రజల పక్షాన పోరుకు సిద్ధం





సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, అన్నదాతలకు అండగా పోస్టర్ విడుదల చేస్తున్న రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, పార్టీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, తలారి వెంకట్రావు, చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్, పార్టీ నేత ఉమాబాల

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స పిలుపు
- ఈ నెల 13న రైతు సమస్యలపై, 27న విద్యుత్ చార్జీల పెంపుపై నిరసనలు
- జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిరసనలు
- తణుకులో పార్టీ శ్రేణులకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నేతల దిశానిర్దేశం

సాక్షి, భీమవరం/ తణుకు అర్బన్: కూటమి సర్కారు అరాచక పాలనతో అవస్థలు పడుతున్న రైతులు, విద్యార్థులు, సామాన్యుల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ నెల 13న రైతు సమస్యలపై కలెక్టరేట్ల వద్ద, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ 27న ఎస్ఈ కార్యాలయాల వద్ద, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జనవరి 3న కలెక్టరేట్ల వద్ద నిరసనలు తెలిపేందుకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. పార్టీ అధినేత పిలుపు మేరకు తణుకులోని పద్మశ్రీ ఫంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ప్రజాప్రతినిధుల సమావేశం విజయవంతంగా జరిగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఆరు నెలలకే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఘనత కూటమి దక్కించుకుందని, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ఈ ఆరు నెలల కాలంలో రూ.35 వేల కోట్ల ప్రభుత్వ లబ్ధిని పేదలు కోల్పోవాల్సి వచ్చిందని బొత్స తెలిపారు. పింఛన్‌లో కేవలం వెయ్యి రూపాయలు పెంచడం మినహా ఈ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేముందని విమర్శించారు. అధికారంలోకి వస్తే రూ. 20 వేలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. విద్యుత్ చార్జీలు రూపాయి కూడా పెంచబోమని చెప్పిన చంద్రబాబు ట్రూఅప్ చార్జీల పేరిట ప్రజలపై భారం మోపారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలపై విద్యుత్ భారం పడకుండా రూ.45,800 కోట్లను సర్దుబాటు చేశారన్నారు. ఈ ఆరు నెలల కాలంలో రూ.60 వేల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఏం చేసిందని బొత్స ప్రశ్నించారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేశారని బొత్స తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. నిత్యావసరాల ధరలు పెరిగిపోయి పేదల జీవితం దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు డిమాండ్ చేస్తామన్నారు. రైతులు, విద్యార్థులు, సామాన్యుల పక్షాన చేపట్టనున్న ఉద్యమాలకు సంబంధించిన పోస్టర్‌ను బొత్స, నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో ఏలూరు, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్‌లు కారుమూరి సునీల్‌కుమార్, గూడూరి ఉమాబాల, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు తెల్లం బాలరాజు, పుప్పాల వాసుబాబు, మామిడిపల్లి జయప్రకాష్, కంభంపాటి జయరాజు, తలారి వెంకట్రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథ్, రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడదాం


ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ పశ్చిమ గోదావరి అధ్యక్షుడు



కూటమికి ఓటేసి ప్రజలు మోసపోయి ఇబ్బందులు పడుతున్నారు. రైతులు, విద్యార్థులు, సామన్యుల ఇబ్బందులపై వారి పక్షాన పోరాటం చేయాలని మన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న కలెక్టరేట్‌ల వద్ద శాంతియుతంగా నిరసన తెలపాలి. విద్యుత్ సమస్యలపై 27న ఎస్ఈ కార్యాలయం వద్ద వినతులు అందజేయాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై జనవరి 3న కలెక్టరేట్ వద్ద నిరసన తెలపాలి. పార్టీని జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూనే ప్రజా సమస్యలపై పోరాటం సాగించాలి.

ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

దూలం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు



కరెంటు చార్జీల పేరిట ఈ ప్రభుత్వం ప్రజల నెత్తిన రూ.15 వేల కోట్ల భారం మోపింది. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం వైఎస్ జగన్ అమలు చేసిన విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు చరమగీతం పాడింది. ప్రజలకు పెనుభారంగా మారిన సమస్యలపై జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రజల తరఫున మనం పోరాటం చేయాలి. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా కలెక్టరేట్, విద్యుత్ ఎస్ఈ కార్యాలయాల వద్ద కార్యక్రమాలు నిర్వహించి వినతులు ఇచ్చే కార్యక్రమాలకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలి.

ఆరు నెలల్లో అరాచకం..

తానేటి వనిత, మాజీ మంత్రి



పార్టీ అధినేత పిలుపు మేరకు ప్రజా సమస్యలపై చేపట్టిన పోరాటాలను విజయవంతం చేయాలి. ఆరు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను అందరూ చూస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని కేసులతో వేధిస్తున్నారు. కార్యకర్తలు అండగా నిలవాలని పార్టీ అధ్యక్షుడు జగన్ నేతలకు సూచించారు.

సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు ?

కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ



కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయడం లేదు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని ప్రజలు గమనిస్తున్నారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలకు భారంగా మారాయి. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ప్రజల తరపున పోరాటాలను విజయవంతం చేయాలి.

పార్టీ బలోపేతానికి కృషి

వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ



రీజనల్ కోఆర్డినేటర్‌గా బొత్స సత్యనారాయణ సారథ్యంలో నాయకులకు, కార్యకర్తలకు మంచి నెట్‌వర్క్ ఏర్పడుతుంది. జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుంది. ఇద్దరు నేతలు ఇచ్చే సూచనలను కేడర్ పాటిస్తూ పార్టీని బలోపేతానికి కృషిచేయాలి.

అధ్వానంగా రోడ్లు

చిర్ల జగ్గిరెడ్డి, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే



కూటమి ప్రభుత్వంలో రోడ్లు అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు కూడా చేయడం లేదు. ఆరు నెలలు గడవక ముందే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చింది. ఈ తరుణంలో ప్రజా సమస్యలపై పోరాడే వైఎస్సార్‌సీపీ శ్రేణుల కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వీరికి అండగా నిలవాల్సిన బాధ్యత మనపై ఉంది.

రైతులను మోసగించిన బాబు

కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి



చంద్రబాబు నాయుడు నిజం చెప్పడని.. ఆయన నిజం చెబితే తలకాయ వెయ్యి చెక్కలవుతుందని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆనాడే చెప్పారు. రైతు భరోసా సాయంగా రూ.13,500 రైతులకు జగన్ మోహన్ రెడ్డి అందించేవారు. అధికారంలోకి వస్తే రూ. 20 వేలు ఇస్తానని చెప్పి చంద్రబాబు రైతులను మోసం చేశారు. బీమా చేయని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. దళారీ వ్యవస్థకు చంద్రబాబు ఆజ్యం పోయడంతో రైతులు నష్టపోతున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, బీమా వంటి వాటికి ఎగనామం పెట్టారు. మన పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వాటిని కప్పిపుచ్చుకోవాలని చూస్తున్నారు.

మిల్లర్లదే రాజ్యం

కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి



వర్షాలతో పంట మునిగి, రంగు మారిన ధాన్యంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతులకు నేటి వరకు పెట్టుబడి సాయం కింద ఒక్క రూపాయి ఇవ్వలేదు. మిల్లర్లు చెప్పినట్లు ఆడేలా వ్యవస్థను చంద్రబాబు మార్చేశారు. సివిల్ సప్లయిస్ మినిస్టర్ ఉన్నా, ఆ శాఖ కంట్రోల్ అంతా ఉపముఖ్యమంత్రి చేతిలోనే ఉంది. వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన అండగా నిలబడుతుంది. ఒక్క రూపాయి విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలను నమ్మించి మోసం చేసి వేల కోట్ల రూపాయల భారం మోపారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకానికి కూడా తూట్లు పొడిచారు.

న్యూస్‌రీల్

ముగిసిన పింఛన్ల తనిఖీ



ప్రాతాళ్ళమెరకలో పింఛన్ అందుకుంటున్న మహిళ ఫొటో తీసుకుంటున్న దృశ్యం

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పింఛన్ల తనిఖీల్లో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కాళ్ల మండలం ప్రాతాళ్ళమెరకలో చేపట్టిన పింఛన్ల తనిఖీ మంగళవారంతో ముగిసింది. ఆకివీడు, ఉండి మండలాలకు చెందిన 12 మంది మండల స్థాయి అధికారుల బృందాలు సచివాలయం పరిధిలోని ప్రాతాళ్ళమెరక, పల్లిపాలెం గ్రామాల్లో పర్యటించి 411 మంది వివరాలు తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఐదుగురిలో ఒకరు రెండు నెలల క్రితం గల్ఫ్ వెళ్లగా.. మిగిలిన వారు అనారోగ్యం కారణంగా హైదరాబాద్, మద్రాసు, భీమవరంలో చికిత్స పొందున్నట్లు గుర్తించామన్నారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా లబ్ధిపొందుతున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఫిషర్ మెన్ తదితర పింఛన్‌దారుల తనిఖీల్లో అనర్హులుగా ఉన్నవారు ఎవరూ లేరని తెలిపారు. పల్లిపాలెం గ్రామంలో ఫిషర్ మెన్ పింఛన్లు పొందుతున్న కొంతమంది వద్ద వాటికి సంబంధించిన పత్రాలు లేనట్టుగా గుర్తించామన్నారు. ఈ రెండు గ్రామాల్లో కొందరు ఒంటరి మహిళలకు కూడా వాటిని నిర్ధారిస్తూ ఉండాల్సిన పత్రాలు లేనట్లుగా గుర్తించినట్లు తెలిపారు. సదరు విషయాలన్నీ ఉన్నత అధికారులకు పంపించినట్లు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

భీమవరం: ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈ నెల 11, 12 తేదీల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. రైతులకు అవగాహన కల్పించాలని.. ముందుగా జరిగిన కోతల్లో కుప్పలు వేసి ఉంటే ఈ నెల 12 తర్వాత నూర్పులు చేసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ 4.10 లక్షల మెట్రిక్ టన్నులు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 38,712 మంది రైతుల నుంచి 2,51,356 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.561 కోట్లు రైతులు ఖాతాలలో జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

జంతువుల హక్కులు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రపంచ జంతువుల హక్కుల దినోత్సవ దృశ్యం

భీమవరం: ఐక్యరాజ్యసమితి ప్రపంచ వ్యాప్తంగా జంతువుల పరిరక్షణ కోసం కొన్ని హక్కులు కల్పించిందని, వాటిని ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలుంటాయని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం జంతు సంక్షేమ సంఘం, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో భీమవరం పశువుల ఆసుపత్రి ఆవరణలో ప్రపంచ జంతువుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ డైరెక్టర్ డైరెక్టర్ జావర్ హుస్సేన్ మాట్లాడుతూ జంతువులను హింసించడం, జంతువధ, జంతు నిర్బంధం వంటివి నేరమని హింస ఘటనలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. పెండ్యాల సరిత, శైలజ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మకంగా నాటిక పోటీలు



నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత? నాటికలో సన్నివేశం

వీరవాసరం: శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర కళాపరిషత్ తోలేరులో నిర్వహిస్తున్న 20వ జాతీయ స్థాయి నాటిక పోటీలు మంగళవారం సందేశాత్మకంగా సాగాయి. తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత? నాటిక మొదటి ప్రదర్శనగా సాగింది. రెండో ప్రదర్శనగా సద్గురు కళా నిలయం గుంటూరు వారి కమనీయం నాటిక ప్రదర్శన సాగింది.

ఉప వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నియామకం

ఏలూరు (టూటౌన్): షెడ్యూల్డ్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణకు రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు వి.జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ మొఘల్రాజపురంలో ఉన్న గిరిజన సంక్షేమ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఆఫీసు ఏర్పాటు చేశారని వినతిపత్రాలు కార్యాలయం పనివేళల్లో సమర్పించాలని కోరారు.

సంచుల కోసం రైతుల పడిగాపులు



పెనుమంట్రలో సంచుల కోసం లారీని చుట్టుముట్టిన రైతులు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో రైతు సేవా కేంద్రాలలో సంచుల కొరత ఏర్పడింది. కొన్ని కేంద్రాల్లో కేవైసీ చేయించుకుని నాలుగు రోజులవుతున్నా సంచులు సరఫరా కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో వేల కొద్దీ సంచులు మగ్గుతున్నా అవి పనికిరాకుండా పోవడంతో రైతులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకుని పాలకొల్లు రైస్‌మిల్లు నుంచి 80 వేల సంచులను పంపించే ఏర్పాటు చేయడంతో మంగళవారం సాయంత్రానికి లారీ సంచులతో సచివాలయానికి చేరింది. దీంతో రైతులు లారీని చుట్టుముట్టడంతో ముందుగా ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు స్థానిక రైతు సేవా కేంద్రం అధికారులు సంచులు సరఫరా చేశారు.

కేంద్రీయ విద్యాసంస్థలతో నిట్ ఒప్పందం



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్వీ రమణరావు తదితరులు

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ మంగళవారం మూడు కేంద్రీయ విద్యాసంస్థలతో ఎంఓయు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డైరెక్టర్ రమణరావు మాట్లాడుతూ నిట్ విద్యార్థులు భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశంతో మూడు కేంద్రీయ విద్యాసంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. ఎంఓయు ద్వారా బీటెక్ చదువుతున్న మూడు నాలుగు సంవత్సరాల విద్యార్థులతో పాటు డిప్లమో ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంటు కోర్సులు చేస్తున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. విశాఖపట్నానికి చెందిన ఐఐఎం, మణిపూర్, రాయపూర్ (చత్తీస్‌గఢ్)లోని ఎన్ఐటీలతో ఎంఓయూలు జరిగాయి. నిట్ డైరెక్టర్ రమణరావు, ఐఐఎం డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, మణిపూర్ నిట్ డైరెక్టర్ డాక్టర్ డీవీఎల్ సోమయాజులు ఎంఓయులపై సంతకాలు చేశారు.

లేసు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కేంద్ర బృందం

భీమవరం(ప్రకాశం చౌక్)/నరసాపురం రూరల్ : లేసు పరిశ్రమకు మరింత వన్నె తెచ్చేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో న్యూఢిల్లీ నుండి వచ్చిన ప్రత్యేక బృందం హ్యాండీక్రాఫ్ట్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేసు అల్లికలను మరింత ఆకర్షణీయంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. డీఆర్‌డీఏ కృషితో నరసాపురం లేసుకు జీఐ గుర్తింపు లభించిందన్నారు. రోజువారీ వినియోగించుకునే లేసు ఉత్పత్తులను తయారు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా 600 ఉత్పత్తులు పోటీపడగా 40 ఉత్పత్తులను గుర్తించారని, వాటిలో పది ఉత్పత్తులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయన్నారు. వీటిలో లేసు ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం కేంద్ర బృందం లేసు పార్క్‌ను సందర్శించి వివరాలు తెలుసుకుంది. మహిళలతో సమావేశమై పలు విషయాలను తెలుసుకున్నారు. ఇంటర్నేషనల్ లేసు ట్రేడ్ సెంటర్‌ను సందర్శించారు.

విభిన్న ప్రతిభావంతుల ఉన్నత విద్యకు సాయపడాలి



భీమవరంలో విభిన్న ప్రతిభావంతుల పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: విభిన్న ప్రతిభావంతులు ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో జిల్లా విభిన్న ప్రతిభావంతులకు ఏర్పాటుచేసిన క్రీడా పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతులు పారా ఒలింపిక్స్‌లో సైతం అనేక పతకాలు సాధిస్తున్నారన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో భవిత కేంద్రాలున్నాయని విభిన్న ప్రతిభావంతులను భవిత సెంటర్లో చేర్చి అక్కడ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతి మూడు నెలలకు ప్రత్యేక దివ్యాంగుల గ్రీవెన్స్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్, ఎస్ఎస్ఏ పీఓ శ్యాంసుందర్, డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

గోవధను అడ్డుకోవాలని బొత్సకు వినతి



బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న గోసంరక్షణ సమితి సభ్యులు

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో నిర్వహిస్తున్న అక్రమ గోవధను అడ్డుకోవాలని కోరుతూ గో సంరక్షణ సమితి సభ్యులు శాసన మండలి ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. పార్టీ సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం తణుకు వచ్చిన బొత్సను గో సంరక్షణ సమితి సభ్యులు బి.శ్రీనివాస్, జల్లూరి జగదీష్‌లు కలిశారు. నిబంధనలకు విరుద్ధంగా తణుకులో జరుగుతున్న గోవధపై వివరించారు. హిందువులు దైవంగా పూజించే గోవులతో పాటు పాడిగేదెలను అక్రమంగా వధిస్తున్నారని తెలిపారు. దీనిని అడ్డుకోవాలని కోరగా బొత్స వెంటనే స్పందించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

అనుమానాస్పద మృతిపై కేసు

కాళ్ల: వివాహిత అనుమానాస్పద మృతిపై కాళ్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై ఎస్.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఎస్వీ బోస్ కాలనీకు చెందిన పారపాటి ఆశాజ్యోతి (22) సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. ఆమెకు భర్త బెంజిమెన్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆశాజ్యోతి మృతిపై ఆమె తండ్రి గులుగుపల్లి వెంకటరత్నం, సోదరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. ఆశాజ్యోతి మృతదేహాన్ని తహసీల్దార్ జి సుందర్‌సింగ్, ఆర్‌ఐ లక్ష్మీకిరణ్ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

భీమవరం: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీమవరం వన్‌టౌన్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మెంటేవారితోటకు చెందిన మద్ది వెంకట సుబ్బయ్య తన ఇంటిలో 6,500 కిలోల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వచేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ.సురేష్‌కు సమాచారం అందింది. దీంతో మంగళవారం విజిలెన్స్ అధికారులతో కలిసి దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. బియ్యం విలువ రూ.2.60 లక్షలు ఉంటుందన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు అర్బన్: మండలంలోని వెలివెల గ్రామానికి చెందిన పెనుమాల రాంబాబు (45) సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో రాంబాబు ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్సై బి సురేంద్రకుమార్ తెలిపారు.

తల్లిని చూడని కుమారులకు కౌన్సెలింగ్



సర్రమ్మ కుమారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ వంశీ

అత్తిలి: వృద్ధురాలైన తల్లిని చూడని ఇద్దరు కుమారులకు తహసీల్దార్ దశిక వంశీ కౌన్సెలింగ్ ఇచ్చారు. తన ఇద్దరు కుమారులు చూడటం లేదంటూ తిరుపతిపురం శివారు శివపురం గ్రామానికి చెందిన గుడిమెట్ల సర్రమ్మ అత్తిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్సై పి ప్రేమరాజు తహసీల్దార్ కోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో మంగళవారం తహసీల్దార్ దశిక వంశీ సర్రమ్మ కుమారులు కోట నాగేశ్వరరావు, సుబ్బారాయుడిని పిలిపించి మందలించారు. తల్లి సర్రమ్మను సరిగా చూసుకునేలా వారి నుంచి ష్యూరిటీ బాండ్లు తీసుకున్నారు.

వైభవంగా తెప్పోత్సవం



షష్ఠి ఉత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న పుష్కరిణిలో హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ప్రధాన అర్చకుడు వీరభద్రశర్మ, సహాయ కమిషనర్ ఆర్ గంగాశ్రీదేవి, పాలకవర్గ సభ్యులు పూజలు నిర్వహించారు. రూరల్ సీఐ వి రవికుమార్, ఎస్సై వీరభద్రరావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – ముదినేపల్లి రూరల్

ఉద్యోగుల నిరసన గళం



సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు కోరుతూ ఉద్యోగులు నిరసన గళం వినిపించారు. విజయవాడలో మంగళవారం తలపెట్టిన ధర్నాకు ఏపీసీపీఎస్ ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగ దుర్గారావు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం నుంచి ఉద్యోగులు తరలివెళ్లారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నాడు ఉద్యోగుల హక్కు అయిన పెన్షన్ కోసం ధర్నా చేస్తున్నట్లు దుర్గారావు తెలిపారు. పెండింగ్ అరియర్లు విడుదల చేయాలని జిల్లా మహిళా అధ్యక్షురాలు బి.మోహన డిమాండ్ చేశారు. – జంగారెడ్డిగూడెం

రైతుల కష్టం నీళ్లపాలు



ఆరుగాలం శ్రమించి పండించిన రైతుల కష్టం నీలపాల్జయింది. ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం ఉదయం జుత్తిగ జిల్లాపరిషత్ రహదారిలో పెనుమంట్ర రజకుల చెరువులోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. వెలగలవారిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు చెందిన 250 బస్తాల ధాన్యాన్ని బ్రాహ్మణచెర్వు రైస్ మిల్లుకు తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు వీఆర్వో రాజు తెలిపారు. – పెనుమంట్ర

నత్తనడకన ఆలయ నిర్మాణాలు

- ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం
- జగన్ ప్రభుత్వంలో జిల్లాలో 36 ఆలయాల పునర్నిర్మాణం
- సీజీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.20.95 కోట్లు కేటాయింపు



భీమవరంలో నిర్మాణంలో ఉన్న సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానం

భీమవరం (ప్రకాశంచౌక్): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు దేవాలయాల అభివృద్ధి పనులపై దృష్టి సారించడం లేదు. దీంతో ఆలయాల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేశారు. పురాతన ఆలయాల అభివృద్ధే లక్ష్యంగా దేవస్థానాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దెబ్బతిన్న ఆలయాలు, వాటి ప్రాంగణాలు, పరిసరాలను పునర్నిర్మాణం చేసి ఆలయాలకు పూర్వ వైభోగం తీసుకురావాలని సంకల్పించారు. అందుకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి నూతన ఆలయాల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నారు.

ఆలయాల నిర్మాణాలకు సీజీఎఫ్ గ్రాంట్ నిధుల విడుదల

గత జగన్ ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 36 ఆలయాల పునర్నిర్మాణాలను చేపట్టింది. ఇందుకోసం సీజీఎఫ్ గ్రాంట్ (కామన్ గుడ్ ఫండ్) నుంచి 36 ఆలయాలకు రూ.20.95 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆలయాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో 67 శాతం నిధులు ప్రభుత్వం అందించగా 33 శాతం మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ దేవస్థానం తరఫున ఖర్చు చేసేలా చర్యలు తీసుకుంది. ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాలకు మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ నిధులకు దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంట్ నుంచి ఆయా ఆలయాల సామర్థ్యం బట్టి నిర్మాణానికి రూ.13 లక్షల నుంచి రూ.1.50 కోట్ల వరకు నిధులు మంజూరు చేసింది. అన్నింటితో కలుపుకుని రూ.28.97 కోట్లతో జిల్లాలో 36 ఆలయాల పునర్నిర్మాణ పనులు జరిగాయి.

సమీక్షలు సైతం లేవు

గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఈఏడాది ఏప్రిల్ వరకు నిర్మాణాలు వేగంగా జరిగాయి. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో నిర్మాణాల్లో జాప్యం చోటుచేసుకుంది. జూలై నుంచి నవంబరు వరకు ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచిపోగా, ప్రస్తుతం ఇసుక లభిస్తున్నప్పటికి ఆలయాల నిర్మాణం వేగంగా జరిగేలా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. దేవదాయశాఖ సైతం వీటిగురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఆలయాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. గత ప్రభుత్వంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు వారి పరిధిలో ఉన్న ఆలయాల నిర్మాణం వేగంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, మంత్రులు ఆలయాల పునర్నిర్మాణ పనులు వేగంగా జరిగేలా కనీసం అధికారులతో సమీక్షించిన దాఖలాలు సైతం కనబడడం లేదు. ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయాల అభివృద్ధి పనులపై చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో ఆలయాలకు మంజూరైన నిధులు

ఆలయం	ప్రాంతం	నిధులు రూ. లక్షల్లో	ఆలయం	ప్రాంతం	నిధులు రూ. లక్షల్లో
సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానం	భీమవరం	రూ.66.66	రామాలయం	దర్శిపర్రు	46.66
పాలేశ్వరస్వామి దేవస్థానం	ఇరగవరం	21.66	లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం	రేలంగి	53.33
కనకదుర్గమ్మ దేవస్థానం	బి.కొండేపాడు	44.66	మదనగోపాలస్వామి దేవస్థానం	కొయ్యేటిపాడు	46.66
శివ కేశవస్వామి దేవస్థానం	కొమరాడ	66.66	అలుసులమ్మ దేవస్థానం	కృష్ణాపురం	40.00
సోమేశ్వరస్వామి దేవస్థానం	ఎల్చిచర్ల	44.66	కోదండరామస్వామి దేవస్థానం	రామారావుపేట	66.00
చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం	చెరుకువాడ	60.00	గణపతి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం	కడియద్ద	66.00
వేణుగోపాలస్వామి దేవస్థానం	చెరుకువాడ	60.00	దేశాలమ్మ దేవస్థానం	కుంచనపల్లి	33.34
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	జక్కరం	66.66	వేంకటేశ్వరస్వామి దేవస్థానం	తాడేపల్లిగూడెం	58.50
కోదండ రామాలయం	చిలుకూరు	90.00	రామాలయం	పడమర విప్పర్రు	33.33
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	నవుడూరు	60.00	వేణుగోపాలస్వామి దేవస్థానం	దువ్వ	13.30
ముత్యాలమ్మ దేవస్థానం	ముత్యాలంబపురం	66.66	రామలింగేశ్వరస్వామి దేవస్థానం	కోపల్లె	100.00
రామేశ్వరస్వామి దేవస్థానం	వెలగలేరు	100.00	బాల వేంకటేశ్వరస్వామి దేవస్థానం	పెంటపాడు	54.00
సోమేశ్వర దేవస్థానం	కవిటం	18.00	జనార్థనస్వామి దేవస్థానం	తూర్పు విప్పర్రు	8.00
గోపాల ఆంజనేయస్వామి దేవస్థానం	కె.పెంటపాడు	80.00	కోదండరామస్వామి దేవస్థానం	తాడేపల్లిగూడెం	5.00
ముత్యాలమ్మ దేవస్థానం	ఆకుతీగపాడు	13.33	తాండవేశ్వరస్వామి దేవస్థానం	ఆరేడు	55.83
గౌరీదేవి దేవస్థానం	పెంటపాడు	66.66	కేశవస్వామి దేవస్థానం	ఆరేడు	45.22
విశ్వేశ్వరస్వామి దేవస్థానం	వల్లూరిపల్లి	150.00			

ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌లో అలసత్వం వద్దు

మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ నాగనరసింహారావు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు

తణుకు అర్బన్: మునిసిపల్ ఉద్యోగుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ అడ్మిని స్ట్రేషన్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు అన్నారు. తణుకు మునిసిపల్ కార్యాలయంలో జిల్లా మునిసిపల్ కమిషనర్లు, అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధుల్లో ఉంటున్న సమయం ఎఫ్ఆర్ఎస్ ద్వారా తేటతెల్లమవుతుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. పురపాలక కార్యనిర్వహణలో కొందరు అధికారులు, సచివాలయ కార్యదర్శులు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఇకపై అటువంటి వారిపై కఠినంగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా సాయంత్రం తంచనుగా 5 గంటలకు విధుల నుంచి వైదొలగడం బాధాకరమని, శాఖాపరంగా ఉన్న లక్ష్యాలను చేరుకునే క్రమంలో సమయాన్ని చూసుకోకుండా విధుల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తణుకు మునిసిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని శానిటరీ అధికారులు, శానిటరీ సెక్రటరీల పనితీరు మెరుగు పడాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో చాలా ఇబ్బందులు ఉన్నాయని, అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయి నిఘా కొరవడిందని సంబంధిత అధికారులు, సెక్రటరీలు అదనపు సమయం పని చేసి పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి కొన్ని మునిసిపాలిటీల పనితీరు బాలేదని ఇళ్లకు వెళ్లి పన్ను వసూలు చేసే విధంగా కృషిచేయాలని ఆదేశించారు. మరుసటి నెల సమీక్షకు పరిస్థితుల్లో మార్పులు రాని పక్షంలో సదరు బాధ్యులపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

కామవరపుకోట: విద్యుత్ షాక్‌తో ఓ మహిళ మృతి చెందింది. తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు తెలిపిన వివరాలివి. కస్సే మహేశ్వరి (27) సోమవారం మధ్యాహ్నం తన పుట్టిల్లు అయిన తడికలపూడి నుంచి వడ్లపల్లి గ్రామంలోని తన ఇంటికి వచ్చి బ్యాగ్‌లోని దుస్తులు పెట్టేందుకు బీరువాను తెరిచింది. అప్పటికే బీరువాకు విద్యుత్ ప్రసరణ వస్తుండడంతో ఆమె బీరువాను తాకగానే విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు గమనించి ఆమె బంధువులకు, తడికలపూడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చెన్నారావు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త కిషోర్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లిక్విడ్ గంజాయి కలిగిన పదిమంది అరెస్ట్



మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీవేద

మొగల్తూరు: లిక్విడ్ గంజాయి కలిగి ఉన్న 10 మంది యువకులను అరెస్ట్ చేశామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడని నరసాపురం డీఎస్పీ జి శ్రీ వేద తెలిపారు. మంగళవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలోని ముత్యామణి లోహిత వైష్ణవి భోజన శాల సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం సమయంలో కొందరు యువకులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారనే సమాచారంతో సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై జి వాసు, తన సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 135.198 మిల్లీ గ్రాముల 19 గంజాయి లిక్విడ్ సీసాలను, 8 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని, గంజాయి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.95 వేలు ఉంటుందని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామానికి చెందిన పొన్నమండ కృష్ణ ప్రసాద్, రామాని కుసుల్ దుర్గ, మచిలీపట్నంలోని గిలకిలదిండికి చెందిన వల్లభుని గోపాల కృష్ణ, రామాని మనోజ్ కుమార్, మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెందిన దొంగ ప్రసాద్, నరసాపురం పట్టణానికి చెందిన కొల్లాటి వాసుదేవ్, జోశ్యుల సుబ్రహ్మణ్యం విశ్వేశ్వర, కర్రి ఆదిత్య వినాయక పవన్‌కుమార్, మొగల్తూరుకు చెందిన చదలవాడ కృపావరం, ఇరగవరం మండలం కాకిలేరుకు చెందిన వీరవల్లి సుధీర్ ఉన్నారని, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుల్లో 6 గురు వ్యక్తులపై వివిధ స్టేషన్లలో పలు కేసులున్నాయన్నారు. ఈ సమావేశంలో సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై జి.వాసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు




పరుగు పందెం పోటీల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

భీమవరం: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 350కు పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. శారీరక వైకల్యం కలిగిన వారికి మూడు చక్రాల రిక్షా, జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో పోటీలు నిర్వహించగా కంటి దృష్టిలోపం ఉన్నవారికి పరుగుపందెం, షాట్‌పుట్, క్రికెట్, బధిరులకు పరుగుపందెం, షాట్‌పుట్, క్యారమ్స్, మానసిక వైకల్యం కలిగిన వారికి పరుగు పందెం, సాఫ్ట్‌బాల్, డిస్కస్‌త్రో వంటి పోటీలు జరిగాయి.

దొంగల ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు, నగదు


- రెండు కేసుల్లో రూ.88.73 లక్షల చోరీ సొత్తు రికవరీ
- ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వెల్లడి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ బంగారు, వెండి వస్తువులు, నగదును అపహరిస్తున్న దొంగల ముఠాను గణపవరం సర్కిల్, ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీ ఎత్తున బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన కట్రెడ్డి మణికంఠ సాయి శ్రీనివాస్, యార్లపాటి మౌనీసన్నీ అలియాస్ సన్నీ, పెద్ద హేమకుమార్ అలియాస్ హేమంత్, పెద్దిరెడ్డి రత్నశేఖర్ అనే నలుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాపై ఉమ్మడి పశ్చిమలోని గణపవరం, భీమడోలు, ఉండి, ఆకివీడు పోలీస్‌స్టేషన్లలో 10కి పైగా కేసులు నమోదు అయ్యాయి. దీంతో ఈ చోరీ కేసులకు సంబంధించి నిడమర్రు సీఐ ఎం.సుభాష్, భీమడోలు సీఐ యూజే విల్సన్, ఎస్సై మణికుమార్, చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్, నిడమర్రు ఎస్సై ఎన్.వీరప్రసాద్ బృందాలుగా ఏర్పడి మంగళవారం ఈ దొంగల ముఠాను పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి 700 గ్రాముల బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి వస్తువులు, రూ.63 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.70 లక్షల వరకూ ఉంటుందని పోలీసుల అంచనా.

మరో కేసులో కేర్ టేకర్ అరెస్ట్

ఏలూరు ఒక ఇంట్లో కేర్‌టేకర్‌గా పనిచేస్తూ ఆ ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగతనం చేస్తున్న మహిళను మంగళవారం ఏలూరు త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం స్థానిక శాంతినగర్‌లో మురళీ హార్మొనీ అపార్ట్‌మెంట్స్‌లో యర్రంశెట్టి సురేష్ నివాసం ఉంటున్నాడు. అతని తల్లికి కేర్ టేకర్‌గా ఏలూరు సత్రంపాడు ప్రాంతానికి చెందిన చింత అనిత వెంకటలక్ష్మి అలియాస్ అనితను పనికి పెట్టుకున్నారు. ఆమె ఇంటిలో పని చేస్తూ బీరువాలోని బంగారు ఆభరణాలను ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక్కొక్కటిగా చోరీ చేస్తూ ఉంది. ఆ బంగారు ఆభరణాలను ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో తాకట్టుపెట్టి డబ్బులు తీసుకుంటుంది. అనుమానం వచ్చిన యజమాని బీరువాను పరిశీలించగా బంగారు ఆభరణాలు అపహరణ కావడాన్ని గమనించి నవంబర్ 30న ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఏలూరు త్రీటౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు, ఎస్సై పీ.రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. నిందితురాలిని ఆమె ఇంటివద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితురాలు అనిత నుంచి 302.50 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.18,73,500 ఉంటుందని పోలీసుల అంచనా. ఈ కేసుల్లో అత్యంత ప్రతిభ చూపిన ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తోపాటు ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, నిడమర్రు సీఐ సుభాష్, ఎస్సైలు, పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాన్ని ఎస్పీ కేపీ శివకిషోర్ అందజేశారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి



మహా సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వేలేరుపాడు: పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికి న్యాయం చేస్తాయోనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. వేలేరుపాడు సీపీఐ కార్యాలయంలో రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ మునీర్, కందుకూరు స్వర్ణ అధ్యక్షతన పోలవరం నిర్వాసితుల మహాసదస్సు మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా తీసుకొని, భూసేకరణ చేసి, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అనర్హులుగా పేర్కొన్న స్థానికులకు ప్యాకేజీ వర్తింపచేయాలన్నారు, ప్రతి కుటుంబానికి ఇచ్చే అన్ని రకాల ప్యాకేజీలు ఒకేసారి ఇవ్వాలని, వివాదాస్పదం లేని భూములను గిరిజనులకు ఇవ్వాలని, కట్ ఆఫ్ తేదీలతో సంబంధం లేకుండా తరలించే నాటికి 18 ఏళ్లు నిండిన యువతి యువకులకు ప్యాకేజీ ఇవ్వాలని, డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు జిరాయితీ భూములు మాదిరిగానే నష్ట పరిహారం ఇవ్వాలని, పునరావాస కాలనీలలో ఉపాధి చూపించాలన్నారు, సర్వేల అవకతవకలను వెంటనే సరి చేయాలన్నారు, మిగులు భూములను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సదస్సులో జాతీయ సమితి సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరికోతలు వాయిదా వేసుకోవాలి



పాలూరులో రైతులతో మాట్లాడుతున్న డీఎం శివ ప్రసాద్

అత్తిలి: మండలంలో అత్తిలి, పాలూరు గ్రామాల్లో మంగళవారం సివిల్‌సప్లై డీఎం శివ ప్రసాద్ పర్యటించారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తుఫాను ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రానున్న మూడు రోజుల పాటు వరికోతలు వాయిదా వేసుకోవాలని శివ ప్రసాద్ రైతులకు సూచించారు. కోసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరారు. ప్రస్తుత ధాన్యం కొనుగోళ్లపై రైతులతో ఆయన చర్చించారు. డీఎం వెంట మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్, మండల కోఆపరేటివ్ ఆఫీసర్ అరుణకుమార్, రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైతులు తదితరులు ఉన్నారు.

మహిళల చట్టాలపై అవగాహన ఉండాలి



ముత్యాలంబాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలంబాపురం గ్రామం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ పని చేసే ప్రదేశంలో మహిళలపై వేధింపులు అధికమయ్యాయని, వీటిని అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి



ఎల్.అగ్రహారం గ్రామంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ముగింపు సభ మంగళవారం మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మరుగుదొడ్డి ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్డి పరిశుభ్రత కాంపిటీషన్‌లో గెలుపొందిన కే.నాగేశ్వరరావు (పెదతాడేపల్లి), దయ్యం గౌరమ్మ (ఎల్.అగ్రహారం)లను ఎంపీడీవో విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజా శ్రీనివాస్‌లు సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి బి.శ్రీరామ్, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, పాఠశాల హెచ్‌ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాస్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీ వాసవి జూనియర్, డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ రూల్స్‌పైన, బైక్‌దారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరుగు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ కొండలరావు మాట్లాడుతూ యువత డ్రగ్స్ వాడకం విడనాడాలని, సైబర్ క్రైమ్ నేరాలపై జరుగు ప్రమాదాలు పట్ల తగు జాగరూకతతో ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి డ్రైవ్ చేయాలని, లేని పక్షంలో తీవ్రగాయాలు కావడం, ప్రాణాలు కోల్పోవడం వంటి నష్టాలు తప్పవన్నారు. కుటుంబ సభ్యులు మన పైన ఆధారపడి ఉంటారని, వాహనదారులు తప్పక జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో ఎక్సైజ్ పోలీసుల దాడులు

తాడేపల్లిగూడెం: గూడెంలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గూడెం మండలం ఆరుగొలను గ్రామంలో బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ఆరు డ్యూటీపెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు మురళీ మోహన్, దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువధశాలపై ప్రజాందోళన



తేతలిలో లేహ్యం ఫుడ్ ఫ్యాక్టరీని మూసేయాలని తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు (ఫైల్)



తేతలిలో లేహ్యం ఫ్యాక్టరీకి గేదెలను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

- కొనసాగుతున్న గోవులు, పశువుల వధ
- లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థలో నిత్యం వధ
- దుర్గంధం, కాలుష్యంతో స్థానికుల అవస్థలు
- ఉద్యమం తీవ్రతరం చేసిన స్థానికులు

తణుకు టౌన్: పాలిచ్చే పాడి పశువులకు కొందరు కర్కశకులు పాడె కడుతున్నారు. బహిరంగంగానే పశువులను తరలించి వధించి మాంసం విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. గోవులను మాత్రం రాత్రి సమయాల్లో ఎవరికంటా కనబడకుండా తీసుకు వచ్చి వధిస్తున్నారు. ఇదంతా తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలోని లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో స్థాపించిన కర్మాగారంలో నిత్యం జరుగుతున్న వధ. వాయు కాలుష్యం, దుర్గంధంతో అవస్థలు పడుతున్నామంటూ స్థానికులు సైతం రోడ్డెక్కారు. గోవులను, పశువులను వధించడం నిలిపివేయాలని, కర్మాగారం తక్షణం మూసివేయాలని డిమాండ్ చేస్తూ గో సేవా సమితి సభ్యులు ఇప్పటికే ఆందోళన కొనసాగిస్తున్నారు. తేతలిలో ఏర్పాటు చేసిన ఈ లేహ్యం ఫుడ్ ఫ్యాక్టరీని వైఎస్సార్ సీపీ పార్టీ జంతు వధశాలకు వ్యతిరేకంగా పోరాడి, పనులను నిలుపుదల చేసినా కూటమి ప్రభుత్వంఅండతో మళ్లీ ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించింది. తణుకు ప్రాంతం నుంచి ఈ ఫ్యాక్టరీ తొలగించాలని పశువధ శాల పరిసర నిర్వాసితులతో పాటు గో సేవా సమితి సభ్యులు, ఎఫ్‌సీఐ గొడౌన్స్ హమాలీలు సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

పాడి గేదెలు ఎక్కడి నుంచి వస్తున్నాయి?

సాధారణంగా వట్టిపోయిన పశువులను రైతులు, యజమానులు కబేళాకు తరలిస్తుంటారు. ఇలాగే లేహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ యాజమాన్యం సైతం వట్టిపోయిన పశువులను మాత్రమే కొనుగోలు చేసి వధించి మాంసం ఎగుమతి చేస్తున్నామని ప్రచారం చేసింది. తాజాగా కార్మాగారానికి తరలిస్తున్న పశువుల్లో ఎక్కువ శాతం పాడి గేదెలు ఉండటం విశేషం. అయితే రైతులు, వాటి యజమానులు పాడి గేదెలను వధించడానికి సాహసించరు. ఇటీవల కాలంలో తణుకు పరిసర ప్రాంతాల్లో గేదెలను అపహరించుకుపోతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాత్రి సమయాల్లో కొందరు ముఠాలుగా ఏర్పడి గ్రామ శివారుల్లో గేదెల ఫామ్‌లు, పాకలను లక్ష్యంగా చేసుకుని పశువులను అపహరించి ఇక్కడ విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. తణుకు మండలం వేల్పూరు గ్రామంలో సైతం రెండు పాడి గేదెలను అపహరించుకుపోయిన ఘటనలో గ్రామానికి చెందిన బండి ఈశ్వరరావు అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనలో నిందితుణ్ని అరెస్టు చేసినప్పటికీ పశువులను పోలీసులు రికవరీ చేయలేకపోయారు. ఇదే తరహాలో గేదెలను దొంగిలించి ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ముఠా సభ్యులకు తేతలి గ్రామానికి చెందిన కొందరు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

దుర్వాసనతో ఉండలేకపోతున్నాం



తేతలి గ్రామంలో ఏర్పాటు చేసిన లేహ్యం ఫుడ్ ఫ్యాక్టరీతో పశువులను వధించడం వలన వ్యర్థాలు సమీపంలోని డ్రెయిన్‌లలో కలిసిపోవడంతో నీరు ఎర్రగా మారిపోయింది. దీనితో పాటు భరించలేనంతగా దుర్వాసన రావడంతో ఇంటిలో ఉండలేక పోతున్నాం. ఇలాగే పరిస్థితులు ఉంటే తమ ఆరోగ్యాలు ఎక్కడ దెబ్బతింటాయోననే భయంగా ఉంది.

– కర్రి స్వప్న, స్థానికురాలు, తణుకు 34వ వార్డు

పనులు చేయలేకపోతున్నాం



తేతలి గ్రామ శివారులో భారత ఆహార సంస్థ గోడౌన్‌ల వద్ద ఏర్పాటు చేసిన పశువధ శాల కారణంగా దుర్వాసన భరించలేకపోతున్నాం. మొదటిలో గొడౌన్‌లు నిర్మిస్తున్నామని చెప్పారని, అయితే అందులో యంత్రాలు పెట్టి పశువులను చంపుతున్నారని తెలియదు. వెంటనే పశువధ శాలను ఇక్కడి నుంచి తరలించాలి.

– గుత్తుల ఏడుకొండలు, ఎఫ్‌సీఐ గోడౌన్ హమాలీ, తణుకు.

కాలుష్యం నుంచి తణుకు పట్టణాన్ని కాపాడాలి



లేహ్యం ఫుడ్ ఫ్యాక్టరీ వ్యర్థాలతో తణుకు పరిసరాలు కలుషితం కాకుండా కాపాడాలి. పశువధ శాల ద్వారా పాడి పశువులను వధించడం వలన వచ్చే వ్యర్థాలతో, కలుషిత వాతావరణంతో తణుకు పట్టణం వార్తల్లో నిలుస్తుంది. ప్రశాంత వాతావరణం కోసం ఇటువంటి పరిశ్రమలను తణుకు పట్టణానికి దూరంగా ఉంచాలి.

– జల్లూరి జగదీష్, గో సేవా సంస్థ సభ్యుడు, తణుకు.

తప్పు యజమానులది కాదు, అధికారులదే



తణుకు మండలం తేతలి గ్రామంలో ఏర్పాటు చేసిన లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న యజమానులది తప్పు కాదు. అసంస్థ నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్నా తమ అధికారంతో ఆపలేకపోయిన అధికారులదే తప్పు. కాబట్టి పశువధ సంస్థకు అనుమతులు ఇచ్చి ఉంటే అధికారులను సస్పెండ్ చేయాలి.

– కొండ్రెడ్డి శ్రీనివాసు, గో సేవా సమితి అధ్యక్షుడు, ఉంగుటూరు

ఘనంగా షష్ఠి ఉత్సవాలు



ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

అత్తిలి: మండలంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్, వంకా రాజకుమారిలు స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేసారు. ఈసందర్భంగా వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వ్యవసాయ, వాణిజ్య, సేవా రంగాలలో ఉన్న వారికి మంచి జరగాలని స్వామి వారిని కోరుకున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, కమిటీ సభ్యులు నార్గాని సత్యనారాయణ, మద్దాల బాపిరాజు, పాల్గొన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రలో పాల్గొనండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర ఈ నెల 13వ తేదీన రాత్రి 8 గంటలకు ఏపీఎస్‌ఆర్టీసీ తాడేపల్లిగూడెం బస్సు స్టేషన్ నుంచి బయలుదేరుతుందని, యాత్రీకులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. 2+2 సూపర్ లగ్జరీ కోచ్ బస్సు ఈ నెల 14వ తేదీన ఉదయం శ్రీకాళహస్తి చేరుతుందని, స్వామి వారి దర్శనం, అనంతరం కాణిపాక విఘ్నేశ్వర స్వామి వారి క్షేత్రం, స్వామి వారి అన్నప్రసాదాలు అనంతరం అక్కడ నుంచి శ్రీపురం మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్‌లో దర్శనం, 15వ తేదీన పౌర్ణమి తెల్లవారుజామున అరుణాచలం, అక్కడ గిరి ప్రదక్షిణ, స్వామి వారి దర్శనం, అదే రోజు సాయంత్రం బయలుదేరి 16వ తేదీన ఉదయం తాడేపల్లిగూడెం చేరుకుంటుందని తెలిపారు. ఛార్జీ రూ. 2,600 అన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉపయోగించుకోవాలని తెలిపారు.

క్రీస్తు మందిరాలకు క్రిస్మస్ కాంతులు



తాడేపల్లిగూడెం పట్టణం జువ్వి రోడ్డులోని లూథరన్ చర్చి





క్రిస్మస్ స్టార్లను విక్రయానికి ఉంచిన దృశ్యం

క్రీస్తు విశ్వాసుల పవిత్ర పండుగ క్రిస్మస్ సమీపిస్తోంది. డిసెంబరు మాసం ప్రారంభం నుంచే క్రీస్తు మందిరాలు, విశ్వాసుల ఇళ్ల వద్ద క్రిస్మస్ స్టార్ల సందడి ప్రారంభమైంది. క్రిస్మస్ పండుగకు మరో రెండు వారాలు మాత్రమే సమయం ఉంది. దీంతో క్రీస్తు ప్రార్థనా మందిరాలను రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

– తాడేపల్లిగూడెం రూరల్

అదానీ ఒప్పందాలను రద్దు చేయండి



సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

తాడేపల్లిగూడెం (టీఓసీ): అదానీ సంస్థపై విచారణ జరిపించాలని కోరుతూ సీపీఐ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ ప్రభుత్వం అదానీ గ్రూపులకు వత్తాసు పలుకుతూ వారి తప్పిదాలను సమర్ధిస్తు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావులు విమర్శించారు. అదానీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలో నిరసన ప్రదర్శన జరిగింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి నాలుగు రాష్ట్రాలలో లంచాలు ఇవ్వడానికి ప్రయత్నించిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని విధంగా ధరలు పెంచి ప్రజలను ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంట్‌లో చర్చజరపాలని, దేశ వ్యాప్తంగా అధిక ధరలు అరికట్టాలని, ఉపాధి హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యదర్శి వడ్డాది మేరీ, ప్రసాద్, బాబూరావు, విజయ్‌కుమార్, రాఘవేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల ప్రాధాన్యత తెలుసుకోవాలి

తాడేపల్లిగూడెం: సమాజ స్థాపనకు మానవహక్కులను అర్థం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నన్నయ్య విద్యాలయ ప్రాంగణంలో జరిగిన మానవహక్కుల దినోత్సవంలో ఆంధ్రాయూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బయ్య, క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.అశోక్‌లు మానవహక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు డాక్టర్ రాజు, డాక్టర్ ప్రశాంతి విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలోని పేకాట స్థావరంపై పెంటపాడు పోలీసులు మంగళవారం అకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా 12 మంది వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1,01,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు గూడెం రూరల్ ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. డీఎస్పీ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి 11 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నట్లు ప్రసాద్ వెల్లడించారు.

తక్షణమే పశు వధశాలను మూసివేయాలి



మాట్లాడుతున్న కొవ్వూరి వీరరాఘవరెడ్డి

తణుకు టౌన్: మండలంలోని తేతలి గ్రామంలో ఎలాంటి ఏర్పాటు చేసిన పశు వధశాలను తక్షణమే మూసి వేయాలని రామరాజ్య ధర్మ స్థాపన సంస్థ వ్యవస్థాపకుడు కొవ్వూరి వీర రాఘవరెడ్డి అధికారులను ప్రశ్నించారు. మంగళవారం తణుకులోని తుమ్మలపల్లి కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తేతలి గ్రామంలోని లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ పేరుతో హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా జంతు వధ జరుగుతుంటే వాటిని అడ్డుకోవలసి వ్యవస్థలలోని అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమాజంలో చెడును తొలగించడం వ్యవస్థలోని అధికారుల వలన కాకపోతే రామ రాజ్యమే ఆపనిని చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గో సేవా సమితి నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసు, జల్లూరి జగదీష్, శ్రీనివాసరాజా, పీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


అలరించిన చిన్నారుల ప్రదర్శనలు



అత్తిలిలో షష్ఠి వేడుకలో కూచిపూడి నృత్య ప్రదర్శన దృశ్యం

అత్తిలి: అత్తిలి షష్ఠి మహోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీస్వామివారి కళావేదికపై పద్మజ డాన్స్ అకాడమి తణుకు వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన జరిగింది. డాన్స్ అకాడమికి చెందిన కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నాట్యాకళా మండలి వారిచే త్రిరత్నాలు రామాంజనేయయుద్ధం, బాల నాగమ్మ, గయోపాఖ్యానం నాటకాలును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉన్నారు.

శ్రీవారి వాకిలి స్వర్ణమయం తొలి దాత రఘురామ్



బంగారు పూతతో ఉన్న అంతరాలయ ద్వారం

ద్వారకాతిరుమల: శ్రీవారి వాకిలి స్వర్ణకాంతులీనుతున్న వేళ తొలి దాత, రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత వడ్డి రఘురామ్ భక్తుల ప్రశంసలు అందుకుంటున్నారు. గర్భాలయం లో కొలువైన స్వామివారి వద్ద పుట్టను, మకర తోరణాన్ని, ప్రధాన ద్వారాన్ని బంగారు మయం చేయాలని ఆలోచన వచ్చిన వెంటనే రఘురామ్ తనవంతుగా తొలి దాతగా ముందుకొచ్చారు. దీంతో స్వర్ణ తాపడానికి తొలి అడుగు పడింది. ఆ తరువాత మిగిలిన ద్వారాలను, అంతరాలయాన్ని జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు బంగారు పూత (ఎలక్ట్రో గోల్డ్ ప్లేటింగ్) చేయించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: నరసాపురం వైఎన్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలలో తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల విద్యార్థినీలు వివిధ పోటీలలో రెండు ప్రథమ, రెండు ద్వితీయ, రెండు తృతీయ స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరిబాయి తెలిపారు. విజేతలైన విద్యార్థులను అభినందించారు.